సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 8 । మార్చి । 2023



న్యూస్‌రీల్

ఘాట్ రోడ్‌లో ట్రాఫిక్ జామ్



ఘాట్ రోడ్డులో నిలిచిపోయిన ట్రాలీలారీ

మారేడుమిల్లి: మండలంలోని మారేడుమిల్లి – చింతూరు ఘాట్ రోడ్డులో మంగళవారం వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రాజమహేంద్రవరం నుంచి భద్రాచలం వెళుతున్న ట్రాలీ లారీ పాములేరు దాటిన తరువాత వాలీ సుగ్రీవ మలుపు వద్ద రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. దీంతో మూడు గంటల పాటు ఇరువైపులా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అనంతరం ట్రాలీని పక్కకు తప్పించడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా సాగాయి.

ద్వైపాక్షిక సహకారంతో మెరుగైన ప్రగతి

ఏయూక్యాంపస్: భారత్–అమెరికా దేశాల ద్వైపాక్షిక సహకారంతో మెరుగైన ప్రగతి సాధ్యపడుతుందని యూఎస్ కాన్సులేట్(హైదరాబాద్) చీఫ్ పొలిటికల్ అండ్ ఎకనామిక్ సెక్షన్ అధికారి సీన్ రూత్ అన్నారు. ఏయూ డీపీఐఐటీ–ఐపీఆర్ చెయిర్, అమెరికన్ కార్నర్ సంయుక్తంగా ఏయూలోని జీఎంఆర్ స్మార్ట్ సెమినార్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన 'యుఎస్–ఇండియా టెక్ కోలాబిరేషన్' అంశంపై ప్రసంగించారు. క్రిటికల్ ఎమర్జింగ్ టెక్నాలజీ రంగంలో రెండు దేశాలు సంయుక్తంగా చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఇన్నోవేషన్, స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి సంయుక్తంగా ఎక్స్‌పోలు, హ్యాకథాన్‌లు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏయూ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్, అమెరికన్ కార్నర్ మెంటార్ డాక్టర్ ఎం.జేమ్స్ స్టీఫెన్, ఏయూ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐపీఆర్ చెయిర్ ప్రొఫెసర్ పురుషోత్తం పాల్గొన్నారు.

27మంది బైండోవర్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న తహసీల్దార్ అప్పలస్వామి, ఎస్‌ఐ శ్రీనివాస్

జి.మాడుగుల: సారా తయారీ, విక్రయాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ కె.అప్పలస్వామి, ఎస్‌ఐ శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలో దిగరాపల్లి, కుంబిడిసింగి గ్రామాల్లో 27 మంది సారా తయారీ, విక్రయదారులపై మంగళవారం బైండోవర్ కేసులు నమోదు చేశారు. వారికి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించారు.

గాయపడిన జింక మృతి



గాయాలతో మరణించిన చుక్కల జింక

రాజవొమ్మంగి: వేటగాళ్ల ఉచ్చులో పడి తీవ్రగాయాలపాలైన చుక్కల జింకకు వైద్యసేవలందించినా ఫలితం లేకపోయింది. పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందింది. సింగంపల్లి వద్ద ఏడాదిన్నర వయస్సు గల ఆడ జింక సోమవారం గాయాలతో కనిపించిన విషయం తెలిసిందే. ఆ జింకకు చికిత్స చేసినప్పటికీ పరిస్థితి విషమించి మరణించినట్టు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బాలాజీ తెలిపారు పశువైద్యులచే పోస్టుమార్టం, పంచనామా నిర్వహించి, అనంతరం జింక కళేబరాన్ని దహనం చేసినట్టు ఆయన చెప్పారు. వన్యప్రాణులను వేటాడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నామని బాలాజీ తెలిపారు.

రక్తహీనతతో గర్భిణి మృతి

హుకుంపేట: మత్స్యపురం పంచాయతీ తురకలమెట్టలో గొల్లోరి పుష్ప(29) అనే గర్భిణి రక్తహీనతతో మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. తీగలవలస పంచాయతీ డి.కామయ్యపేటలో భర్త ఆనంద్‌తో కలిసి ఆమె నివాసముంటోంది. వారికి ఒకకుమారుడు ఉన్నాడు. ఎనిమిది నెలల గర్భిణి అయిన పుష్ప రక్తహీనతతో బాధపడుతోంది. ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఉప్ప పీహెచ్‌సీ వైద్యుల సూచనమేరకు పాడేరు ఆస్పత్రిలో చికిత్స పొందింది. అక్కడ రెండు సార్లు రక్తం ఎక్కించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించినట్టు ఆమె భర్త ఆనంద్ తెలిపారు. అక్కడ కూడా రక్తం ఎక్కించారని, పది రోజుల పాటు అక్కడే ఉండి వైద్య సేవలు పొందినట్టు చెప్పారు. ఆరోగ్యం మెరుగుపడడంతో వారం రోజుల క్రితం పుష్ప తల్లిదండ్రుల గ్రామమైన తురకలమెట్టకు వెళ్లామని, ఆదివారం నుంచి ఆరోగ్యం క్షీణించిందని కేజీహెచ్‌లో ఇచ్చిన మందులు వాడినప్పటికీ ఫలితం లేకపోయిందని ఆయన తెలిపారు. మంగళవారం తన భార్య మృతి చెందిందని చెప్పారు.

అడవి తల్లి ముద్దు బిడ్డలు



కొండకోనల్లో జయకేతం ఎగురవేశారు...వనాలతో వందనాలు అందుకున్నారు... గూడాల ప్రజల గుండెల్లో నిండిపోయారు...సౌకర్యాలు లేకపోయినా... సాహసంగా పరిస్థితులకు సవాల్ విసిరి గెలిచి చూపించారు...అహర్నిశలు శ్రమిస్తున్నారు... కార్యసాధనలో చేవ చూపుతున్నారు... నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తూ... శక్తి స్వరూపిణులుగా నిలుస్తున్నారు జిల్లాలో మహిళా ప్రజాప్రతినిధులు.

- లాలనలో .. పాలనలో సత్తా చాటుతున్న గిరి మహిళలు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

పాడేరు/కొయ్యూరు/చింతూరు/అనంతగిరి : ఆధునిక మహిళ చరిత్రను పునర్లిఖిస్తుందన్నారు మహాకవి గురజాడ. ఆయన మాటను నిజం చేస్తూ.. ఆకాశమే హద్దుగా సత్తా చాటుతామంటున్నారు నేటి మహిళలు. ఆలన–పాలన నుంచి ఆర్మీ, అంతరిక్షం వరకు ఎందాకైనా వెళ్లే సాహసం వారి సొంతం. ఏదైనా సాధించగల ఆత్మవిశ్వాసం వారి ఆయుధం. లాలిస్తారు. అవసరమైతే కాఠిన్యం చూపిస్తారు. సమాజంలోని పరిస్థితులు మారాయి. రాజకీయ, వ్యాపార, వైద్యం తదితర రంగాల్లో గిరి మహిళలు తమ ప్రతిభ చూపుతున్నారు. పిల్లల లాలనలోనే కాదు ప్రజా పాలనలోనూ ముందుంటాం అంటున్నారు. రాజకీయాల్లో సత్తా చాటుతూ పురుషులకు తామేమీ తీసిపోమంటూ విజయాలు కైవశం చేసుకుంటున్నారు. అధికార పీఠం అధిరోహించి.. అడవి బిడ్డల సేవలో తరిస్తున్న ఆ మహిళామూర్తులు తరిస్తున్నారు.

ప్రజా సంకల్పయాత్రే రాజకీయ ప్రస్థానానికి నాంది



కొయ్యూరు మండలం శరభన్న పాలెం పుట్టిన నన్ను ప్రజా సంకల్పయాత్ర చాలా ప్రభావితం చేసింది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెనుక అడుగులు వేస్తూ కొంత దూరం పాదయాత్ర చేశాను. ఆ యాత్రే నా రాజకీయ ప్రస్థానానికి నాంది పలికింది. నేను డిగ్రీ వరకు చదువుకుని పీఈటీ శిక్షణ పొందాను. అనంతరం వైఎస్ పాకల పాఠశాలలో పీఈటీగా పనిచేశాను. మాది రాజకీయ కుటుంబం. నాన్న దేముడు చింతపల్లి నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. అమ్మ టీచర్‌గా పనిచేస్తున్నారు. నాన్న చనిపోయిన తరువాత ఇబ్బందులు పడ్డాం. ఈ నేపథ్యంలో పీఈటీగా ఉద్యోగంలో చేరాను. తరువాత అనూహ్యంగా రాజకీయాల్లో వచ్చాను. నాన్న దేముడు నిజాయితీని తెలుసుకున్న జగన్‌మోహన్ రెడ్డి నన్ను పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. అనంతరం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా అరకు పార్లమెంట్ స్థానానికి పోటీచేసి ఎంపీ కాగలిగాను.నా జీవితం ఇలా మారిపోతుందని ఊహించలేదు.ఇప్పుడు భర్త శివప్రసాద్ సహకారంతో గిరిజనుల అభ్యున్నతికి, నాన్న ఆశయాలు నెరవేర్చేందుకు కృషి చేస్తున్నాను.

– గొడ్డేటి మాధవి, అరకు ఎంపీ

నాన్నే రాజకీయ గురువు



పాడేరు ఎమ్మెల్యేగా సేవలందించిన నాన్న చిట్టినాయుడు నాకు రాజకీయ గురువు. మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి సమక్షంలో 2009లో కాంగ్రెస్‌లో చేరాను. ఎమ్మెస్సీ చదివిన నేను 2011లో బీసీ సంక్షేమశాఖలో మేట్రిన్ ఉద్యోగంలో చేరాను. విశాఖలోని ఎంవీపీకాలనీలోని బీసీ హాస్టల్‌లో కొన్ని నెలలు పనిచేశాను.అప్పటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ట్రిపాడ్ వైస్ చైర్మన్‌గా ఉన్నత పదవి ఇవ్వడంతో ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేశాను.అరకు పార్లమెంట్ పరిధిలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా పనిచేశాను. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పనిచేసేందుకు 2018లో వైఎస్సార్‌సీపీలో చేరాను.2019 ఎన్నికల్లో పాడేరు అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందాను. నా భర్త డాక్టర్ తమర్బ నరసింగరావు అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నారు. గిరిజనులకు మరింతగా సేవ చేసేందుకు కృషి చేస్తున్నాను.

– కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే, పాడేరు.

చదువే ముందుకు నడిపించింది..



ముంచంగిపుట్టు మండలం లబ్బూరు వంటి గిరిజన గ్రామంలో పుట్టిన నేను ఈరోజు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఉన్నానంటే.. నా చదువు సంధ్యలే అందుకు కారణం. పెళ్లయినా నేను చదువు ఆపలేదు. భర్త సహకారంతో డిగ్రీ పూర్తి చేశాను. ఓ బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత కూడా రోజుకు సుమారు 240 కిలోమీటర్లు ప్రయాణిస్తూ బీఈడీ చదువుకోవడానికి చోడవరం వచ్చేదాన్ని. అలాగే పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. పాడేరులోని సెయింటాన్స్ పాఠశాలలో టీచర్ పనిచేస్తుండగా అనుకోని పరిస్థితుల్లో రాజకీయాల్లోకి ప్రవేశించాల్సివచ్చింది. ముంచంగిపుట్టు జెడ్పీటీసీగా గెలవడంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్‌గా అవకాశమిచ్చారు. చదువే నన్ను ఇంతటిదాన్ని చేసిందని నమ్ముతున్నాను. విద్యావంతురాలైన మహిళ నవ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించగలదు. తలచుకోవాలే గానీ అతివకు సాధ్యం కానిదేమీ ఉండదు కదా.

– జె.సుభద్ర, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్

మహిళల సేవలు ఆదర్శనీయం



ఏటీడబ్ల్యూవో రజనిని సన్మానిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ,ఎస్పీ సతీష్‌కుమార్

- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి,పాడేరు: సమాజ, కుటుంబ అభివృద్ధికి మహిళలు నిరంతరం శ్రమిస్తున్నారని, వారి సేవలు ఆదర్శనీయమని, ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక కాఫీ అతిథి గృహంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఇప్పుడు బాలికలంతా విద్యలో రాణిస్తున్నారని,గిరిజన మహిళలు రాజకీయాల్లోను సత్తా చాటుతున్నారని తెలిపారు. మహిళల రక్షణకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు దిశ,నిర్భయ,పోక్సో చట్టాలను పకడ్బందీగా అమలుచేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాలు,హక్కులపై మహిళలు అవగాహన ఏర్పర్చుకోవాలని తెలిపారు. అనంతరం పాడేరు ఏటీడబ్ల్యూవో ఎల్.రజనీ,వైద్యాధికారి హిమబిందుతో పాటు పలువురు మహిళా ఉద్యోగులను ఐటీడీఏ పీవో, ఎస్పీ సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, డీఈవో డాక్టర్ రమేష్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో భారతీకుమారి, పాడేరు సీడీపీవో జాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

సేవతోనే సంతృప్తి..



సేవ చేయాలన్న తపనే రాజకీయాల వైపు నడిపించింది. దంతవైద్యాధికారి ఉద్యోగం వదలి ఇటువైపు వచ్చా. అరకు నియోజకవర్గంలోని అనంతగిరి మండలం భీమవరం గ్రామం మాది. అమ్మ శోభా హైమావతి ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆమె రాజకీయ వారసత్వాన్ని అందుకున్నాను. శ్రీకాకుళం సాయి డెంటల్ కళాశాలలోని చదువుకున్నా. ఆ సమయంలోనే గణేష్‌తో పరిచయం ఏర్పడి, ప్రేమవివాహం చేసుకున్నా. అనంతరం విశాఖపట్నంలోని దంతవైద్యాధికారిగా పనిచేశా. సేవా చేయాలన్న తపనతో సాలూరు నుంచి జెడ్పీటీసీగా గెలుపొంది, విజయనగరం జెడ్పీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టాను. ఏపీ బెస్ట్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా ప్రధానమంత్రి మోదీ చేతులు మీదుగా అవార్డు అందుకున్నాను. మహిళలకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రాధాన్యతకు ఆకర్షితురాలినై వైఎస్సార్‌సీపీలో చేరాను. జీసీసీ చైర్‌పర్సన్ బాధ్యత చేపట్టి, జీసీసీ బలోపేతానికి కృషిచేస్తున్నాను. మహిళలు కష్టాల్లో కుంగిపోకుండా ఎదుర్కొంటే అనుకున్న దానిని సాధించవచ్చు.

– శోభా స్వాతిరాణి, జీసీసీ చైర్‌పర్సన్

ఎమ్మెల్సీగా సుధాకర్‌ను గెలిపించాలి



ప్రచారం చేస్తున్న ఎంపీ మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

- అరకు ఎంపీ మాధవి

డుంబ్రిగుడ: వైఎస్సార్‌సీపీ బలపరచిన సీతంరాజు సుధాకర్‌ను ఎమ్మెల్సీగా గెలించాలని కోరుతూ అరకు ఎంపీ మాధవి, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. స్థానిక నాయకులతో కలిసి మంగళవారం డుంబ్రిగుడలో ప్రచారం చేశారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు కరపత్రాలు అందజేశారు. సోమవారం రాత్రి బల్లుగుడ గ్రామంలో పీఆర్టీయూ నాయకుల మద్దతు కోరారు. మండలంలోని 16 గ్రామ సచివాలయల ఉద్యోగులు ఎంపీ, ఎమ్మెల్యేలను సత్కరించారు. గ్రామ సచివాయ ఉద్యోగుల నాయకులు త్రినాథ్‌రావు, విఘ్నేశ్వరరావు, రాంబాబు లక్ష్మణదాసు, అనంతరావు, సంజీవ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో చదువుకోవాలని ఎంపీ మాధవి, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. స్థానిక కేజీబీవీలో పదో తరగతి విద్యార్థినుల వీడ్కోలు వేడుక కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అందిస్తున్న సౌకర్యాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఎస్‌వో సుజాత, ఎంఈవో త్రినాథరావు, హెచ్‌ఎం బాలాజీ, ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ చట్టారి జానకమ్మ, పార్టీ మండలాధ్యక్షుడు శెట్టి గోపాల్, మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు, సర్పంచ్ వెంకటరావు, ఉప సర్పంచ్ జగ్గునాయుడు, వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, బాక సింహాచలం పాల్గొన్నారు.

108లో ప్రసవం



పసిబిడ్డతో మహిళ

మారేడుమిల్లి: కొయ్యూరు మండలం బట్టు మలక గ్రామానికి చెందిన కడబల కన్నమ్మ మంగళవారం 108 అంబులెన్స్‌లో మగబిడ్డకు జన్మనిచ్చింది. తొలుత ఆమెకు పురిటి నొప్పులు రావడంతో ఆటోలో మారేడుమిల్లి తీసుకువస్తుండగా మార్గమధ్యలో ప్రసవ వేదనకు గురైంది. అదే సమయంలో బోదులూరు పీహెచ్‌సీకి రోగులను తీసుకొస్తున్న 108 అంబులెన్స్ సమాచారం మేరకు కన్నమ్మ వద్దకు చేరుకుంది. ఈఎంటీ వెంకట్, పైలట్ ధనుంజయ్ ప్రసవం చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, బోదులూరు పీహెచ్‌సీలో చేర్పించామని వారు తెలిపారు.

జిల్లా ఆస్పత్రిలో కలెక్టర్, పీవో తనిఖీలు

- రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం



తనిఖీ చేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరు రూరల్ : ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు, నాణ్యమైన ఆహారం అందించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం ఆయన పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణతో కలిసి జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆపరేషన్ థియేటర్, పౌష్టికాహార పునరావస కేంద్రాన్ని పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఆహారంపై ఆరా తీశారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా పర్యవేక్షణ జరపాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.కృష్ణారావును ఆదేశించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు తమ సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. తమకు సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అనంతరం త్వరలో ప్రారంభించనున్న సికిల్‌సెల్ ఎనిమియా, తలసేమియా స్క్రీనింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆస్పత్రి నిర్వాహకులకు సూచించారు. మరో 15 రోజుల్లో మళ్లీ ఆస్పత్రిని సందర్శిస్తానని లోటుపాట్లను సరిదిద్దుకోవాలని కలెక్టర్ సూచించారు.

అప్పన్నకు పెళ్లి కుదిరింది..



స్వామికి అడవివరం గ్రామంలో తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు

సింహాచలం: సింహగిరిపై వేంజేసిన శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి పెళ్లి కుదిరింది. సింహగిరి నుంచి కొండ దిగువకు వచ్చి తనకు పిల్లనివ్వమని తన సోదరి, అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారిని స్వామి అర్థించాడు. ఏం చూసి పిల్లనివ్వాలని తొలుత నిరాకరించిన పైడితల్లి అమ్మవారు... ఆ తర్వాత స్వామికి ఉన్న వైభవాన్ని, ఆయనకున్న భక్తజన సందోహాన్ని చూసి ఆశ్చర్యపోయింది. చివరకు పిల్లనివ్వడానికి అంగీకరించింది. దీంతో ఈ నెల 22న ఉగాది రోజున పెళ్లిరాట ఉత్సవం, ఏప్రిల్ 2న చైత్ర ఏకాదశిని పురస్కరించుకుని వార్షిక కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.

ఘనంగా డోలోత్సవం :

పాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి డోలోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు.

సీలేరులో ఆర్టీసీ శాటిలైట్ డిపో

- మూడు ఎకరాల స్థలం ఎంపిక
- సబ్ కలెక్టర్ అభిషేక్



సీలేరులో ఆర్టీసీ డిపో నిర్మించేందుకు అవసరమైన స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో ఆర్టీసీ శాటిలైట్ డిపో ఏర్పాటు చేయనున్నట్టు పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ తెలిపారు. ఇందుకోసం మూడు ఎకరాల స్థలాన్నిఎంపిక చేసినట్టు ఆయన చెప్పారు. డిపో నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ జిల్లా విస్తీర్ణం ఎక్కువగా ఉందని, ప్రజల సౌకర్యార్థం, అధికారుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అందరికీ అందుబాటులో ఉండేలా సీలేరులో శాటిలైట్ డిపో నిర్మించేందుకు ప్రజా రవాణా శాఖ చర్యలు చేపడుతోందన్నారు. అవసరమైన మూడు ఎకరాల స్థలాన్ని గ్యాస్ గొడౌన్ సమీపంలోని సర్వే నంబర్ 8లో ఎంపిక చేసినట్టు చెప్పారు. ఈ స్థలం కోసం జెన్‌కో అధికారులకు లేఖ రాయనున్నట్టు తెలిపారు. పాడేరు డిపోకు కొత్తగా ఏడు బస్సులు కేటాయించారని, వీటిలో రెండు బస్సులు పాడేరు నుంచి సీలేరు మీదుగా చింతూరుకు రాకపోకలు సాగిస్తాయన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పూర్తిస్థాయి ఏర్పాట్లు

ఈ నెల 13న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టినట్టు సబ్‌కలెక్టర్ చెప్పారు.స్థానిక పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మండలంలో గూడెంకొత్తవీధి, సీలేరుల్లో పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. సీలేరు జెడ్పీహెచ్ పాఠశాలను తనిఖీ చేసి 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట తహసీల్దార్ రాజశేఖర్ ఉన్నారు.

పాఠశాల స్థాయినుంచే లక్ష్యసాధనకు కృషి

గూడెంకొత్తవీధి: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు లక్ష్యాలు నిర్ణయించుకుని, నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ అన్నారు. గూడెంకొత్తవీధి గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలలో రూ.12లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను మంగళవారం ఆయన ప్రారంభించి, పరికరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గణేశ్వరరావు, ఉపాధ్యాయులు, గిరిజన సంక్షేమశాఖ డీఈఈ చాణక్యరావు, తహసీల్దారు రాజ్‌కుమార్ పాల్గొన్నారు. సబ్‌కలెక్టర్‌ను ఉపాధ్యాయులు సత్కరించారు. గూడెంకొత్తవీధిలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని సబ్‌కలెక్టర్ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

తాజంగిలో హోలీ సంబరాలు ప్రారంభం



ముంచంగిపుట్టులో రంగులు పూసుకుని సందడి చేస్తున్న యువకులు

చింతపల్లి రూరల్: తాజంగిలో మంగళవారం రాత్రి హోలీ సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏటా ఇక్కడ వినూత్నంగా సంబరాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా 60 అడుగుల కట్టెల పేర్పును ఏర్పాటు చేశారు. ముందుగా రాధాకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. తెల్లవారితే బుధవారం 5 గంటలకు కట్టెల పేర్పుకు నిప్పంటిస్తారు. దీని చివర భాగంలో కట్టిన తెగిపడుతున్నప్పుడు పట్టుకున్న వారికి నగదు బహుమతి అందజేయడంతోపాటు గ్రామంలో ఊరేగిస్తారు. కట్టెల పేర్పు ఎటువైపు పడితే అటు వైపు ప్రాంతంలో పంటలు బాగా పండుతాయన్నది గిరిజనుల నమ్మకం . తర్వాత రంగులు ముఖాలకు పూసుకుని సంబరాలు ముగిస్తారు.

ముంచంగిపుట్టు మండలంలో..

ముంచంగిపుట్టు: మండలంలో హోలీ వేడుకలను గిరిజనులు ఉత్సాహం నిర్వహించారు. ముంచంగిపుట్టుతో పాటు కొండపడ, దారెల గ్రామాల్లో సోమవారం రాత్రి రాధాకృష్ణుల విగ్రహాలకు గిరిజన సంస్కృతీ సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించి, థింసా నృత్యాలతో సందడి చేశారు. మంగళవారం ఉదయం నుంచి రంగులు చల్లుకుని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యువకులంతా ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

రంపచోడవరం: పాస్టర్ ఐ చంద్రపాల్ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాద బాధితుడు తుర్రం మోషేకు చేయూతనందించారు. బిషప్ జెమ్స్ సామర్లకోట, బిషప్ బ్లేస్సింగ్ కాకినాడ వారు నిత్యావసరాలు, దుస్తులు, రూ.10 వేలు అందజేశారు.







ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌ను గెలిపించుకుందాం

అరకులోయ రూరల్: ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించుకుందామని ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరుతూ స్థానిక పర్యాటక శాఖ హరిత, మయూరి యూనిట్లలో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి ఉద్యోగులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎల్.బి. కిరణ్‌కుమార్, మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

పెదబయలు: ఉత్తరాంధ్రపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఎంపీపీ కాసులమ్మ, జెడ్పీటీసీ బొంజుబాబు, వైస్ ఎంపీపీ రాజుబాబు తెలిపారు. మంగళవారం మండలంలో పలు పంచాయతీల్లో పార్టీ నాయకులు నాలుగు బృందాలుగా ఏర్పడి ప్రచారం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు వంతాల ఆనందరావు, మాజీ జెడ్పీటీసీలు జర్సింగి గంగాభవానీ, సూర్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌కు మద్దతుగా లక్ష్మీపురం, బుంగాపుట్టు, బరడ పంచాయతీల్లో ప్రచారం చేశారు. సచివాలయాల ఉద్యోగులను, ఉపాధ్యాయులను ఓటు వేయాలని కోరారు. సర్పంచ్ నీలకంఠం, పార్టీ మండల నేతలు జగబంధు, సాధురాం, అప్పారావు, తిరుపతి, రాంప్రసాద్, భాగత్‌రాం పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని కంఠారం, బాలారం, బకులూరు, ఆడాకుల ప్రాంతాల్లో సచివాలయాల సిబ్బందిని పార్టీ నాయకులు కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేయాలని కోరారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, పార్టీ మండలాధ్యక్షుడు జల్లి బాబులు, ఏఎంసీ చైర్మన్ జె. రాజులమ్మ, మండల కన్వీనర్ బండి సుధాకర్, సీనియర్ నేత గాడి సత్యనారాయణ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు, సర్పంచ్‌లు సోమన్నదొర, రాజుబాబు, పాటి శేఖర్, పాట్టిక శ్రీను పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

రంపచోడవరం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సీఐ సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీసులు కేక్ కట్ చేశారు. ఎస్సై మోహన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకురాలు పి. టాన్యా ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.



రంపచోడవరం పోలీస్ స్టేషన్‌లో కేక్ కట్ చేస్తున్న మహిళా ఉద్యోగులు

చింతూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏరియా ఆస్పత్రి గైనకాలజిస్ట్ శశికళాదేవిని సన్మానించారు. ప్రిన్సిపాల్ రత్నమాణిక్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: సర్పంచ్ కొంగర మురళీకృష్ణ ఆధ్వర్యంలో జడ్డంగి గ్రామ సచివాలయం వద్ద అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ ఒడుగుల జ్యోతి, తదితరులను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, సీఐ షేక్ బాజీలాల్ సన్మానించారు. ఎస్సైలు గోపీ నరేంద్రప్రసాద్, పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు, సర్పంచ్‌లు దాసరి నాగేశ్వర్రావు, సవిరెల చంద్రుడు పాల్గొన్నారు.

జి.మాడుగుల/అరకులోయ రూరల్: జి.మాడుగుల మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం సుందరమ్మకు ఎంఎంఎస్ సభ్యులు, ఉద్యోగులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అరకులోయ గిరిజన సంఘం కార్యాలయంలో ఐద్వా నాయకురాలు వి.వి. జయ మాట్లాడారు. నాయకురాళ్లు భాగ్యవతి, శశికళ, మాలతి, నిర్మల, పంప పాల్గొన్నారు.

ప్రతి బాల్య వివాహానికి ఎఫ్‌ఐఆర్

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొందు సీతారాం

అనంతగిరి: గ్రామాల్లో ప్రతి బాల్య వివాహానికి ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొందు సీతారాం పోలీసులకు సూచించారు. మండలంలోని కొత్తూరు గ్రామ సచివాలయంలో వివిధ శాఖల అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులతో ఆయన సమావేశమయ్యారు. ముందుగా మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసేందుకు, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీల సహకారం కోరామన్నారు. ఐసీడీఎస్ కార్యకర్తలు, మహిళా పోలీసులు గ్రామాల్లో ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం చీడివలస అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.



కొత్తూరు సచివాలయంలో మాట్లాడుతున్న గొందు సీతారాం

డీటీ లచ్చాపాత్రుడు, ఎంఈవో వెంకటరావు, ఏటీడబ్ల్యూవో కూడా వెంకటరమణ, సీడీపీవో సంతోషకుమారి, ఏఎస్ఐ రాజంనాయుడు, సీఆర్పీఎఫ్ అల్లూరి జిల్లా కన్వీనర్ బాకా లవకుశ, కార్యదర్శి వరలక్ష్మి పాల్గొన్నారు.









మంటలను అదుపు చేసిన అటవీ సిబ్బంది



దముకు సమీపంలోని మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

అనంతగిరి: స్థానిక ఘాట్‌రోడ్డులోని దముకు సమీపంలో టేకుతోటలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించాయి. అటవీ శాఖ రేంజర్ దుర్గాప్రసాద్ ఆదేశాలతో ఘాట్‌రోడ్డులోని విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఆ ప్రదేశానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. కొద్ది రోజులుగా ఘాట్ రోడ్డులోని కార్చిచ్చుకు మంటలు వ్యాపించి, అడవులు దగ్ధమవుతున్నాయి. దీనిపై అటవీ శాఖ సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

25 కేజీల గంజాయి స్వాధీనం



పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

మోతుగూడెం : మోటార్ బైక్‌పై గంజాయి తరలిస్తున్న నిందితులను మోతుగూడెం పోలీస్‌లు మంగళవారం పట్టుకున్నారు. ఎస్ఐ వి.సత్తిబాబు సిబ్బందితో లక్కవరం జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్నారు. మోటార్ బైక్‌పై రెండు ప్లాస్టిక్ బ్యాగుల్లో తరలిస్తున్న 25 కేజీల గంజాయిని వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు గంజాయిని ఒడిశా రాష్ట్రం కెందువాడలో కొనుగోలు చేసి భోపాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రానికి తరలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కేసులో మధ్యప్రదేశ్‌కు చెందిన హరోం ఉపాధ్యాయ, కమలేష్, వై.రామవరం మండలం బొడ్డగండికి చెందిన పాంగి కిషోర్‌లను అరెస్టు చేసినట్టు తెలిపారు. ఒకరు పరారీలో ఉన్నట్టు తెలిపారు. వీరి నుంచి ఒక మోటార్ బైక్, ఐదు ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. తనిఖీలో ఏఎస్ఐ పట్టాభిరామయ్య, హెచ్‌సీ సత్తిబాబు, పీసీలు సన్యాసిరావు, మురళీకృష్ణ, శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సిరామిక్ పాట్ ఫిల్టర్స్ తయారీపై శిక్షణ

అడ్డతీగల: మన్యంలో సురక్షితమైన మంచినీరు అందకపోవడం వల్ల అనేక వ్యాధులు ప్రబలుతున్నాయని, వీటి నివారణకు సిరామిక్ పాట్ ఫిల్టర్స్ వాడకాన్ని తీసుకురావడానికి గిరిజన యువతకు శిక్షణ ఇస్తున్నట్లు లయ స్వచ్ఛంద సంస్థ ఏరియా కోఆర్డినేటర్ జి.బుల్లయ్య తెలిపారు. ఈ నెల 2న ప్రారంభమైన మొదటి బ్యాచ్ శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఇదే బ్యాచ్‌కి ఈ నెలాఖరులో మరో వారం రోజుల పాటు రెండో దశ శిక్షణ ఇస్తామన్నారు. క్వెస్ట్ సంస్థ నుంచి సునీల్, సెహగల్ ఫౌండేషన్ తరపున లలిత్‌శర్మ రిసోర్స్ పర్సన్లు వ్యవహరించారు.



శిక్షణ పొందుతున్న ఆదివాసీ యువత (ఇన్‌సెట్లో) తయారైన సిరామిక్ పాట్ ఫిల్టర్